మెట్రో నగరాలకు దీటుగా నగరాభివృద్ధి

మేయర్ కావటి, ఎమ్మెల్యే మద్దాళి గిరి


శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్ కావటి, ఎమ్మెల్యే మద్దాళి గిరి

నెహ్రూనగర్: మెట్రో నగరాలకు దీటుగా గుంటూరు నగరాన్ని తీర్చిదిద్దనున్నట్లు మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 22వ డివిజన్‌లో శుక్రవారం రూ.67.32 లక్షలతో, 34వ డివిజన్‌లో రూ. 30 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వైజాగ్, విజయవాడ లాంటి నగరాలకు దీటుగా గుంటూరు నగరాన్ని తీర్చిదిద్దడానికి పలు అభివృద్ధి పనుల్ని చేపట్టినట్లు తెలిపారు. కుల, మత, పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల్ని అందజేస్తున్నారన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని గుంటూరు నగరంలో అభివృద్ధి పనుల్ని పారదర్శకంగా కుల, మత,పార్టీలకతీతంగా నిర్వహిస్తున్నామని వివరించారు. వైఎస్సార్ సీపీ పాలకవర్గం ఏర్పడ్డాక అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. నగరంలో రూ. 200 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. శంకుస్థాపన చేసిన పనుల్ని త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం రూ.120 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఇంకా కొన్ని పనులు టెండర్ దశలో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల్ని గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు ఎక్కడ అవసరమో గుర్తించి, ప్రజావసరాల దృష్ట్యా ప్రా ధాన్యత క్రమంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బూసి రాజలత, అందుగుల సంతోష్, నిమ్మల వెంకట రమణ, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామి రెడ్డి, డీఈఈలు రమేష్ బాబు, రఫీక్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

నెహ్రూనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని డెప్యూటీ మేయర్ షేక్ సజీల చెప్పారు. ఆమె శుక్రవారం 7వ డివిజన్ పరిధిలోని లిబర్టీ థియేటర్ ఎదురుగా ఉన్న బెస్తపేటలో రూ.27లక్షలతో కొత్తగా వేస్తున్న మంచినీటి పైపు లైన్, యూజీడీ లైన్, సైడ్ డ్రెయిన్లు, సీసీ రోడ్డు నిర్మాణ పనుల్ని పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనుల్ని చేపట్టాలని ఆమె నగరపాలక సంస్థ అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షౌకత్, కిశోర్, సుధాకర్ పాల్గొన్నారు.

కవి వేదయ్య ఇకలేరు

పాత గుంటూరు: వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత డెప్యూటీ కమిషనర్, కవి, కళాపోషకుడుగా ప్రసిద్ధి చెందిన బి.వేదయ్య (86) మృతిచెందారు. గుంటూరు లక్ష్మీపురంలో వారి గృహంలో వేదయ్య పార్థివదేహాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, కన్నా మాస్టారు సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. వేదయ్య మృతిపట్ల పలువురు కవులు, కళాకారులు, సాహితీ అభిమానులు శ్రద్ధాంజలి ఘటించి వారు తెలుగు సాహిత్యానికి చేసిన సేవల్ని కొనియాడారు. హరిహరమహల్ పక్క వీధిలోని వేదయ్య గృహం వద్ద శనివారం ఉదయం 11 గంటలకు సంతాపసభ అనంతరం అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యార్థుల నోట్సుల పరిశీలన తప్పనిసరి: డీవైఈవో



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల నోట్సులను క్రమం తప్పకుండా పరిశీలించాలని గుంటూరు డీవైఈవో పి. వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులకు సూచించారు. వేణుగోపాల్ నగర్‌లోని కోన బాల ప్రభాకరరావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన పదో తరగతి విద్యార్థుల నోట్, వర్క్‌బుక్స్ పరిశీలించారు. విద్యార్థుల వర్క్ బుక్స్‌ను ప్రతి రోజూ పరిశీలించి, పెండింగ్ లేకుండా చూడాలని ఉపాధ్యాయులకు చెప్పారు. ఈ దిశగా ప్రధానోపాధ్యాయులందరూ తగిన సూచనలు చేయాలని ఆయన ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులందరు ఉత్తీర్ణులయ్యే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎఫ్ఏ-1 మార్కుల్ని షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయురాలు మంజులాదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

నవజాత శిశువుల సరంక్షణపై శిక్షణ

గుంటూరు మెడికల్ గుంటూరు జీజీహెచ్ శుశ్రుత హాలులో శుక్రవారం నవజాత శిశు సంరక్షణపై కేర్ కంప్యానియన్ ప్రొగ్రామ్ జరిగింది. నర్సింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ శోభరాణి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అప్పుడే పుట్టిన శిశువుల ప్రాణ రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం కేర్ కంప్యానియన్ ప్రొగ్రామ్ నిర్వహిస్తోందన్నారు. నర్సింగ్ సిబ్బంది శిక్షణ ద్వారా మెళుకువలు నేర్చుకుని పసికందుల ప్రాణాలు కాపాడాలన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమాల ద్వారా సీనియర్ వైద్యులు తమ అనుభవాన్ని వివరిస్తారని, శిక్షణ పొందేవారికి ఇది ఎంతో ఉపయోగపడుతోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హేమంత్, డాక్టర్ తనూజ, డాక్టర్ జీనా, పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు ప్రజల నుంచి విశేష ఆదరణ

- ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- 37 వేల అర్జీలకుగానూ 35 వేలు పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్. పక్కన కార్పొరేటర్ గోపీ శ్రీనివాస్

నగరంపాలెం: సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా జూలై 1 నుంచి 31 వరకు చేపట్టిన జగనన్న సురక్షకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించిందని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అర్హత ఉండి ఇంకనూ సంక్షేమ పథకాలు పొందని లబ్ధిదారుల కోసం జగనన్న సురక్షకు శ్రీకారం చుట్టారని చెప్పారు. గతంలో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమాల్లో వచ్చిన సమస్యల్ని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేర్లతో ప్రజల్ని మోసగించారని ఆయన ఆరోపించారు. పెన్షన్, రేషన్ కార్డు ఇతరత్రా పథకాలు ప్రజలకు వచ్చేవి కాదని తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా పెద్దఎత్తున ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డుల్ని పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రజల వద్దకే పరిపాలనను చూపించిన ఏకైక సీఎం వై.ఎస్.జగన్ అని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలో జరిగిన జగనన్న సురక్షకు 37 వేల అర్జీలు రాగా, 35 వేలను పరిష్కరించినట్లు వెల్లడించారు. గత టీడీపీ హయాంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సి వచ్చేందని, డబ్బులు కూడా ముట్టజెప్పాల్సి వచ్చేదని తెలిపారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, ఒక్క రూపాయి చెల్లించకుండా ఇళ్ల వద్దకే పరిపాలనను సీఎం జగన్ అందిస్తున్నారని వివరించారు. 15 వేల సచివాలయాలు ప్రజలకు నిర్విరామంగా ప్రభుత్వ సేవలు అందిస్తున్నాయని చెప్పారు. ఏపీలో సంక్షేమ పథకాల్ని ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తెలిపారు.

రైతుల ముసుగులో టీడీపీ నేతలు అడ్డుకోవడం బాధాకరం

రాజధానిలో పేదలు నివసించేందుకు వీల్లేదని, రైతుల ముసుగులో టీడీపీ నేతలు అడుగడుగున అడ్డుకోవడం బాధాకరమని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. రాజధానిలో పేద ప్రజలు నివసించే అర్హత లేదా? అని ప్రశ్నించారు. పేదలు అక్కడ ఉండకూడదనే నెపంతో కేసులు దాఖలు చేయడం సరికాదని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు నివసించేందుకు వీల్లేదని టీడీపీ కుట్రకు పాల్పడుతోందని ఆరోపించారు. రాజధానిలో 50 వేల ఇళ్లను అడ్డుకునే పరిస్థితి టీడీపీ హేయమైన చర్యని పేర్కొన్నారు. రాజధానిలో ఇళ్ల పంపిణీతో సుమారు 1.50 లక్ష మంది జనాభాకు లబ్ధి చేకూరుతుందని, తద్వారా ఒక మున్సిపాల్టీగా మారుతుందని చెప్పారు. ఇక ఇళ్ల నిర్మాణాలు చేపడితే ఒక ఊరుగా రూపాంతరం చెందుతుందని వివరించారు. ఇకనైనా సిగ్గుమాలిన చర్యలకు స్వస్తి చెప్పాలని చంద్రబాబుకి హితవు పలికారు. త్వరలో పేదల పక్షాన తీర్పు వస్తుందని, ఇళ్ల నిర్మాణాలు వేగవంతమవుతాయని చెప్పారు. రాజధానిలో పేదల ఇళ్లను అడ్డుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో టీడీపీ అండ్ కో అడ్డుకునే ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. ధర్మ పోరాటంపై మాట్లాడే నైతిక హక్కు చంద్రబాబుకి లేదని విమర్శించారు. రాజధానిలోని 50 వేల పేద ప్రజల కుటుంబాల పొట్ట కొట్టిన చంద్రబాబు, ధర్మంపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, పార్టీలు చూడకుండా రాజధానిలో పేద ప్రజలకు ఇళ్లు పంపిణీ చేశారని చెప్పారు. సమావేశంలో 33వ డివిజన్ కార్పొరేటర్ గోపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ


కిట్లను పంపిణీ చేస్తున్న నూరిఫాతిమా, కార్పొరేటర్ రంగారెడ్డి

పట్నంబజారు: పోషకాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ మహిళా నేత షేక్ నూరిఫాతిమా, డివిజన్ కార్పొరేటర్ రంగారెడ్డి పేర్కొన్నారు. జగనన్న సంపూర్ణ పోషణ-తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తూర్పు నియోజకవర్గంలోని 1వ డివిజన్ నవభారత్‌నగర్‌లో గర్భిణిలు, బాలింతలకు పోషక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి మహిళను సొంత సోదరి భావించి, వారికి ఇబ్బందులు తలత్తెకుండా అనేక సంక్షేమ పథకాల్ని అందుబాటులోకి తీసుకు వచ్చారని తెలిపారు. గర్భిణులకు పోషకాహారం ఎంతో అవసరమని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆనందపేట అంగన్‌వాడీ కేంద్రంలో కిట్ల పంపిణీ


ఆనందపేటలో అంగన్‌వాడీ కేంద్రంలో కిట్లతో బాలింతలు, గర్భిణులు

నెహ్రూనగర్: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేస్తోందని ఈస్ట్- 2 సెక్టార్ సూపర్‌వైజర్ నీలిమ పేర్కొన్నారు. ఆనందపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం టేక్ హోం రేషన్, తల్లిపాల వారోత్సవాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులంతా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆబిద్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొని కిట్లు పంపిణీ చేశారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

పట్నంబజారు: వ్యక్తిపై దాడి చేసి దూషణకు దిగిన ఇద్దరిపై కేసు నమోదైంది. ముత్యాలరెడ్డి నగర్‌కు చెందిన పల్లప్రోలు కావ్యశ్రీ సోదరుడితో కలసి శుక్రవారం కొత్తపేటలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువుల్ని చూసేందుకు బయల్దేరారు. ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై నెహ్రూనగర్ నుంచి వెంటపడుతూ కొత్తపేట వరకు వచ్చారు. గమనించిన కావ్యశ్రీ,ఆమె సోదరుడు ఎందుకు వెంటపడుతున్నారంటూ ప్రశ్నించడంతో ఇద్దరు ద్విచక్ర వాహనం అడ్డుపెట్టి దాడి చేశారు. కావ్యశ్రీని దుర్భాషలాడారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కొత్తపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారికి టోకరా

వ్యాపారిని మాయ చేసి ఫోన్‌పే ద్వారా డబ్బులు కొట్టుకుని ఉడాయించిన వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేటకు చెందిన గోలి పూర్ణచంద్రరావు దుస్తుల వ్యాపారం చేస్తుంటారు. శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి 15 చీరలు కొంటానని వచ్చి నమ్మబలికాడు. అయితే, తన వద్ద డబ్బులు లేవని, స్నేహితుడు ఫోన్‌పే చేస్తాడని చెప్పాడు. ముందుగా స్నేహితుడికి ఫోన్ ద్వారా రూపాయి పంపాలని చెబుతూ, ఆయన వద్ద ఫోన్ తీసుకుని వేరే అకౌంట్‌కు రూ. 45వేలు పంపించాడు. అనంతరం అక్కడి నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆటో చోరీ

గుంటూరు ఈస్ట్: ఆటో చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళదాస్‌నగర్‌కు చెందిన వల్లూరి శేషగిరిరావు శుక్రవారం కోర్టు బయట ఆటో నిలబెట్టాడు. కోర్టులో పనులు ముగించుకుని తిరిగి బయటకు వచ్చి చూడగా కనిపించలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

యువతిని వేధిస్తున్న యువకుడిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లికార్జునపేటకు చెందిన పాలెపోగు అజయ్, యువతి కొంతకాలం ప్రేమించుకున్నారు. పెద్దలు వారించడంతో యువతి అజయ్‌తో దూరంగా ఉంటోంది. అయినప్పటికీ వెంటపడి వేధిస్తున్నాడు. యువతి ఇంటికి వెళ్లిన అజయ్ తనను ప్రేమించాలంటూ బెదిరించి భయభ్రాంతులకు గురి చేశాడు. యువతి ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ సిమ్‌ల మోసం

ఒకే ఫొటోతో అనేక సెల్‌ఫోన్ సిమ్‌లు తీసుకున్న సంస్థపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రాడీపేటలోని త్రివేణి ఎంటర్‌ప్రైజెస్ సంస్థ 2020లో ఒకే ఫొటోతో పలు అడ్రస్సులు, ఇతర వివరాలు ఇచ్చి బీఎస్ఎన్ఎల్ సంస్థ నుంచి సిమ్‌లు తీసుకుంది. సంస్థ అధికారులు ఇటీవల ఈమోసాన్ని గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పిల్లందరితో ఆల్బెండోజల్ మాత్రలు మింగించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణ్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

గుంటూరు మెడికల్: జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కార్యాలయంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులతో డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10న జాతీయ నులి పురుగుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు 337 ఉన్నాయని, వీటిల్లో 5,91,322 మంది విద్యార్థులు ఉన్నట్లు వెల్లడించారు. 1 నుంచి 19 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ ఆల్బెండోజల్ మాత్రలు మధ్యాహ్నం భోజనం అనంతరం ఇవ్వాలని ఆయన సూచించారు. 1 నుంచి రెండు సంత్సరాల్లోపు పిల్లలకు అర మాత్ర నీటిలో కరిగించి తాగించాలని, 3 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్రను నమిలించి మింగించాలని చెప్పారు. ఈనెల 5న ప్రధానోపాధ్యాయులకు ఆల్బెండోజల్ 400 ఎంజీ మాత్రలు అందించాలని అధికారుల్ని ఆదేశించారు. ఈనెల 8న ప్రధానోపాధ్యాయులు పాఠశాల అసెంబ్లీలో నులు పురుగులు వచ్చే అనారోగ్య సమస్యలు రక్తహీనత, పోషకాహార లోపం, రోగ నిరోధక తగ్గుదల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.10వ తేదీన మాత్రలు తీసుకోని వారుంటే 17న జరిగే మాపప్ రౌండ్‌లో ఇవ్వాలని చెప్పారు. జిల్లా విద్యా శాఖ అధికారి పి.శైలజ మాట్లాడుతూ మాత్రలు పిల్లల చేతికి ఇవ్వకూడదని, పొరపాటున ఎక్కువ మోతాదు వేసుకుంటే ప్రమాదానికి దారి తీస్తోందని తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ జి.కె.జుబేర్, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన విజిలెన్స్ తనిఖీలు

700 కిలోల మెగ్నీషియం సల్ఫేట్ స్వాధీనం


మెగ్నీషియం సల్ఫేట్ ప్యాకెట్లను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నగరంపాలెం: గుంటూరు ఆటోనగర్‌లోని శ్రీనిధి ఆగ్రో సైన్సెస్ సంస్థలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. నరసరావుపేట టౌన్‌లో అనధికారికంగా నిల్వ చేసిన సుమారు రూ.50 లక్షల విలువైన మైక్రో న్యూటియన్స్ ఫర్టిలైజర్స్, మెగ్నీషియమ్ సల్ఫేట్ నిల్వల్ని గుంటూరు రీజినల్ విజిలెన్స్ అధికారులు గురువారం పట్టుకున్న సంగతి తెలిసిందే. నిల్వల్లో గుంటూరులోని శ్రీనిధి పేరుతో కిలోల ప్యాకెట్లను గుర్తించారు. ఈ మేరకు విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు రెండో రోజు శుక్రవారం ఆటోనగర్‌లోని శ్రీనిధి సంస్థలో తనిఖీలు జరిపారు. గతేడాదిలో 26 మెట్రిక్ టన్నుల (20, 10 కిలోలు, 1కిలో ప్యాకెట్లు) సూక్ష్మపోషక ఎరువుల్ని నరసరావుపేటకు సరఫరా చేసినట్లు గుర్తించారు. అయితే, ఎటువంటి ముడి సరుకుని ఇక్కడ్నుంచి నరసరావుపేటకు పంపించలేదు. ఇక సరుకు తనిఖీ చేయగా, వ్యత్యాసం గుర్తించారు. సంస్థలో రూ.56 వేలు విలువ చేసే 700 కిలోల మెగ్నీషియం సల్ఫేట్‌ను స్వాధీనం చేసుకుని 6-ఎ, క్రిమినల్ కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ వ్యవసాయ అధికారిణి జె.వాసంతి, సీఐ ఎ.శ్రీహరిరావు, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య, స్థానిక రెవిన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకార వేతనాలు

గుంటూరు ఎడ్యుకేషన్: బొందలపాటి మార్కెటింగ్ ప్రైవేటు లిమిటెడ్ 33వ వార్షికోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల నుంచి టెన్త్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఈనెలాఖరులో రూ.1,100 చొప్పున ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు సంస్థ మేనేజర్ వి.ఎం. రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ మార్కుల జాబితా, ఆధార్ జిరాక్స్ కాపీలు, తల్లిదండ్రుల సెల్ నంబరు, విద్యార్థి పాస్‌పోర్ట్ సైజు ఫోటోను ఈనెల 15లోపు బొందలపాటి1967ఎట్‌దరేట్ యా హూ.కామ్‌తో పాటు 93941 51967 వాట్సాప్ నంబరుకు పంపా లని ఆయన సూచించారు. ఎంపికైన విద్యార్థుల సెల్ కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారాన్ని పంపుతామని పేర్కొన్నారు. ఉపకార వేతన పంపిణీకి విద్యార్థులు స్వయంగా హాజరుకావాలని ఆయన సూచించారు.

శారీరక శ్రమ, మానసిక ప్రశాంతతతో గుండె పదిలం


డాక్టర్ నాగ హరిత

గుంటూరు ఎడ్యుకేషన్: శారీరక శ్రమ, మానసిక ప్రశాంతతతో గుండెను పదిలంగా ఉంచుకోవచ్చునని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.నాగ హరిత పేర్కొన్నారు. అమరావతి రోడ్డు హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలోని హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగం-రమేష్ ఆస్పత్రి సంయుక్తంగా 'జీవన విధానం-గుండె పనితీరుపై ప్రభావం' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ నాగ హరిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ దినచర్య పట్టిక అనేది ఉండాలని, తద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం దొరుకుతుందని సూచించారు. ఉదయాన్నే నిద్రలేచి, యోగా, ప్రాణాయామం, వ్యాయామం చేసే వారిలో 10 నుంచి 35 శాతం ఎక్కువగా ప్రయోజనం ఉంటుందని తెలిపారు. శారీరక శ్రమ చేయడంతో పాటు జంక్ ఫుడ్ పూర్తిగా మానేయాలని సూచించారు. పని గంటలు సులభంగా ఉండటంతో పాటు డైట్ మేనేజ్‌మెంట్ సక్రమంగా నిర్వర్తించాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ జీవన విధానంతో సగటు మనిషి ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి నెలా అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఐదు సదస్సులు నిర్వహించినట్లు వివరించారు. సదస్సులో కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డి. కల్యాణి, సీహెచ్. వైష్ణవి, సీహెచ్. వేదవతి, వి. అభిలాష్, బి. అనిత, మణికంఠ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

రాజధానిలో ఇళ్ల నిర్మాణానికి వ్యతిరేకంగా చంద్రబాబు కుట్రలు

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: రాజధాని అమరావతిలో పేదల ఇళ్ల నిర్మాణానికి వ్యతిరేకంగా రైతుల ముసుగులో చంద్రబాబు చేస్తున్న కుట్రల్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఒక ప్రకటనలో ఆరోపించారు. పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలు రాజధానిలో ఉండరాదనే దుర్మార్గపు బుద్ధితో చంద్రబాబు, టీడీపీ నేతలు ప్రభుత్వం చేపడుతున్న పేదల ఇళ్ల నిర్మాణాలకు వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించడం సిగ్గుచేటని ఖండించారు. సుప్రీం కోర్టులో న్యాయ పోరాటం చేసిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 50 వేలకు పైగా పేదలకు ఇళ్ల పట్టాల్ని పంపిణీ చేసి, ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన తరువాత హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం వెనుక చంద్రబాబు చేసిన కుట్రలే కారణమని ఆరోపించారు. చంద్రబాబు హయాంలో పేదల ఇళ్ల కోసం మొత్తం భూమిలో ఐదుశాతం ఇళ్ల స్థలాలకు కేటాయించాలని చట్టంలో ఉన్నప్పటికీ, ఒకసెంటు భూమిని సైతం ఇవ్వకుండా అక్కడి పేదల్ని మోసగించారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చట్ట ప్రకారం పేదలకు 50 వేల ఇళ్ల స్థలాల్ని కేటాయించగా, రాజధానిలో పేదలు వచ్చి చేరితే అదో పెద్ద మురికివాడలా మారుతుందని, తద్వారా పెత్తందారుల భూములు, స్థలాల ధరలు పడిపోతాయనే కుటిల బుద్ధితో దరిద్రపు ఆలోచనలు చేయడం సిగ్గుచేటన్నారు. దీనిపై సీఎం వై.ఎస్.జగన్ సుప్రీం కోర్టులో న్యాయ పోరాటం చేసి అడ్డంకుల్ని తొలగిస్తారనే ధీమా వ్యక్తం చేశారు.

ఎంటీఎస్ అమలు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఎయిడెడ్ కళాశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులకు మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) అమలు చేయాలని ఏపీ ఎయిడెడ్ కళాశాలల పార్ట్‌టైం అధ్యాపక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరిగ జోషిరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘ నాయకులు శుక్రవారం ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, టి. కల్పలతారెడ్డిని వారి క్యాంపు కార్యాలయాల్లో కలసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జోషిరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎయిడెడ్ పార్ట్‌టైం అధ్యాపకులకు న్యాయం జరగలేదని తెలిపారు. సుదీర్ఘ పాదయాత్రలో వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి తమ సమస్యను విన్నవించుకోగా, అధికారంలోకి వచ్చిన తరువాత న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ విషయమై సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిని గతంలో కలసి విజ్ఞప్తి చేయగా, ఆయన పరిష్కారానికి గాను అధికారుల్ని ఆదేశించారని తెలిపారు. ఈ సమస్యపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులందరికీ వినతిపత్రాలు సమర్పిస్తున్నట్లు తెలిపారు.

బాలింతలకు దుస్తుల పంపిణీ


బాలింతలకు పండ్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గుంటూరు జీజీహెచ్ గైనకాలజీ వార్డులో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో బాలింతలు, పిల్లలకు పండ్లు, బిస్కెట్లు, దుస్తులు పంపిణీ చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తల్లులు పోషకాహారం తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ జయంతి, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు గీత, కార్యదర్శి సత్యశ్రీ, జయశ్రీ పాల్గొన్నారు.

అపోహలు తొలగించండి

తల్లిపాలు ఇవ్వడం వల్ల అందం తగ్గిపోతుందన్న అపోహల్ని వైద్య సిబ్బంది తొలగించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నర్సింగ్ విద్యార్థులు ప్రసూతి విభాగంలో తల్లిపాల ప్రత్యేకత, తల్లి ప్రయోజనాల గురించి లఘు నాటిక ప్రదర్శించారు. విద్యార్థుల్ని సూపరింటెండెంట్ అభినందించారు.

జీఎస్ఆర్ మెమోరియల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న చుక్కపల్లి రమేష్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): క్రీడల్ని ప్రోత్సహించడం సామాజిక బాధ్యతని పయనీర్ ఆటో వరల్డ్ అధినేత చుక్కపల్లి రమేష్ తెలిపారు. జీఎస్ఆర్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం గుజ్జుల సుధాకరరెడ్డి మెమోరియల్ బాలబాలికల అండర్-13, 15, 17 తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల ఓపెన్ బ్యాడ్మింటన్ పోటీల్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డిలాంటి శిక్షకులు ఉంటే మెరికల్లాంటి క్రీడాకారులు వెలుగులోకి వస్తారని కొనియాడారు. ప్రభుత్వంతో పాటు వివిధ కార్పొరేట్ సంస్థలు కూడా ప్రోత్సహిస్తే పేద కుటుంబాల నుంచి గొప్ప క్రీడాకారులు వచ్చి అద్భుత ఫలితాలు సాధిస్తారని పేర్కొన్నారు. జీఎస్ఆర్ అకాడమీ సీఈవో డాక్టర్ కె.సావిత్రి మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి అనుక్షణం క్రీడాభివృద్ధికే కృషి చేసారన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఆయన ఆకాంక్షను ముందుకు తీసుకెళ్లి ఔత్సాహిక క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకు అకాడమీ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ పోటీలు ఆదివారంతో ముగుస్తాయని తెలిపారు. మొత్తం 500 ఎంట్రీలు వచ్చాయని, విజేతలకు మొత్తం రూ.2 లక్షల వరకు నగదు పారితోషకాలతో పాటు ట్రోఫీలు అందజేస్తామని వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ టి-షర్ట్ ఇస్తామన్నారు. అనంతరం చిన్నారులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జి.వెంకటరావు, జిల్లా రెడ్ క్రాస్ సంస్థ వైస్ చైర్మన్ పి.రామచంద్ర రాజు, మేరుగ విజయలక్ష్మి, టోర్నమెంట్ కార్యదర్శి సీహెచ్. విల్సన్ బాబు, కె.ఓంకార్, జీవీఎస్ ప్రసాద్, ఎల్.రజని, రాము పాల్గొన్నారు.